# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



## జనరేటర్ల కాలమస్తది..



తాంసి, నవంబర్ 25 : కాంగ్రెస్ హయాంలో కరెంటు సరిగ్గా ఇచ్చేవాళ్లు కాదు. కండ్ల ముందు పంటలు ఎండిపోతే చూడలేక జనరేటర్లు కిరాయికి తెచ్చి నీటి పారకం చేసేవాళ్లం. వోల్టేజీతో మోటర్లు కాలిపోతే.. అరిగోస పడ్డ రోజులు ఉన్నాయ్. సీఎం కేసీఆర్ వచ్చినప్పటి నుంచి 24 గంటల ఉచిత కరెంట్ అందిస్తుండడంతో ఆ బాధలన్నీ పోయాయి. ఎప్పుడంటే అప్పుడు పొలం దగ్గరికి పోయి మోటరు ఆన్ చేస్తే నీళ్లు వస్తున్నాయ్. కాంగ్రెసోళ్ల మాటలు నమ్మి అవకాశం ఇస్తే మళ్లీ జనరేటర్ల కోసం, మోటర్ల రిపేర్ల కోసం మెకానికల్ చుట్టూ తిరగాల్సి వస్తది. **- కీర్తి స్వామి, రైతు, ఖోడద్, తలమడుగు మండలం.**

## మూడు గంటలతో మడి కూడా తడువదు..



ఇంద్రవెల్లి, నవంబర్ 25 : వ్యవసాయానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నది. దీంతో మా వ్యవసాయ భూముల్లో అన్ని రకాల పంటలు సాగు చేస్తున్నాం. కాంగ్రెస్ పార్టీ నాయకులు మూడు గంటల విద్యుత్ సరిపోతుందని అనడం రైతులకు నష్టం చేయడమే అవుతోంది.ఇంకా 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోమని చెబుతున్నది. మూడు గంటల కరెంటుతో మడి కూడా తడవదనే విషయం వారికి తెలియదా? ఇదీ ఎలా సాధ్యమవుతుందో కాంగ్రెసోళ్లే తెలుపాలి. బీఆర్ఎస్ హయాంలో రాత్రి, పగలు వ్యవసాయానికి విద్యుత్ అందుతున్నది. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ ఉంటేనే పంటలు బాగా పండుతాయి. మూడు గంటల కరెంటిస్తామన్న కాంగ్రెస్‌ను బొందపెట్టాలి. **- నర్సింలు, రైతు, ఖైర్‌గూడ.**

## కాంగ్రెసోళ్లను ఎట్ల నమ్మాలె..



నార్నూర్, నవంబర్ 25: కాంగ్రెస్ సర్కారు ఉన్నప్పుడు ఇచ్చే కరెంటుతోటి రాత్రిళ్లు పొలాలకాడనే ఉండేది. గీ పదేండ్లల్ల ఏనాడైనా బాయిలకాడికి, బోర్ల కాడికి రాత్రి పూట పోయినమా. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మళ్లీ పాత రోజులే వస్తయ్. అమలు కాని హామీలు చెప్పి రైతులను ఆగమాగం చేస్తున్రు. 3 గంటల కరెంటుకు ఎకరం పొలం కూడా పారదు. 24గంటల కరెంట్‌తో అవసరం ఉన్నప్పుడు వానకాలం, యాసంగి పంటలకు నీళ్లు పెడుతున్నం. ఇప్పుడున్న కరెంటుతో ఎవుసాన్ని పండుగల లెక్క చేసుకుంటున్నం. గత ప్రభుత్వాల పాలనల సాగునీళ్ల, సరిపడా కరెంటు లేక అరిగోస పడ్డం. నాణ్యత మైన కరెంటు లేక మోటర్లు కాలిపోయేవి. పంటలు చేతికి వచ్చేదాంక బీఆర్ఎస్ పాలనల రైతుల ఇబ్బందులు పోయినయ్. ఎవుసం గురించి తెల్వనోళ్లే మూడు గంటల కరెంటు పాట పాడుతున్నరు. 10 హెచ్‌పీ మోటర్లు పెట్టాలనే నాయకులకు ఎవుసంపై కనీస అవగాహన లేదు. లక్ష దాకా ఖర్చయ్యే మోటరు పెట్టి ఎవుసం చేసే స్థోమత మాకు లేదు. ప్రతి పక్షాల మాటలను నమ్మం. అడగకున్నా అన్నం పెట్టే నాయకుడి వెంటే ఉంటం. అడ్డగోలుగా మాట్లాడే నాయకులకు బుద్ధి చెప్తాం. **- ఆత్రం సుంగు, రైతు**

## ధరణితోనే రైతులకు పూర్తి భరోసా

ఇంద్రవెల్లి, నవంబర్ 25 : ధరణితోనే రైతులకు పూర్తిరక్షణతో పాటు భూములకు భరోసా ఉంది. భూముల పంచాయితీలు ఎక్కడా కనిపించడం లేదు. ఇంతకుముందు భూముల లెక్కలు రాసే సార్లు ఒకరి భూములు మరోవ్యక్తి మీద రాసి ఆగం చేసేటోళ్లు. ఇప్పుడు అటువంటిపరిస్థితి లేదు. భూమి అమ్మగానే కొనుక్కున్న వాళ్ల పేరు మీదకి వెంటనే ఎక్కిస్తున్నారు. అప్పటికప్పుడు పాస్‌బుక్‌లో సర్వే నంబర్‌తో సహా రాసి ఇస్తున్నారు. ఇంతమంచి ధరణితో రైతులకు మేలు కలుగుతుంది. **-పీ చందు, రైతు, ఆంధ్‌హర్యాపూర్, ఇంద్రవెల్లి మండలం**



# మడి తడువదు..

- మూడు గంటల కరెంటిస్తలంటరు.. ● 10 హెచ్‌పీ మోటర్లెట్ల పెట్టుకోమంటరు..
- కాంగ్రెసోళ్ల మాటలన్నీ మోసమే.. ● రైతన్నల ఆవేదన

కాంగ్రెస్‌కు అవకాశం ఇస్తే కరెంటు కష్టాలు తప్పవని రైతులు పేర్కొంటున్నారు. రైతుల కష్టాలు తెలిసిన సీఎం కేసీఆర్ వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నారని, రైతులు సంతోషంగా, క్షేమంగా ఉండాలని కోరుకునే కేసీఆర్ పాలన కొనసాగాలని బలంగా కోరుకుంటున్నారు. పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి చెప్పినట్లుగా వ్యవసాయానికి మూడు గంటల విద్యుత్ సరఫరా చేస్తే రైతులకు కష్టాలు తప్పవంటున్నారు. మూడు గంటల కరెంటుతో మడి కూడా తడవదని, రైతుల బతుకులు ఆగమవుతాయని వారు ఆందోళన చెందుతున్నారు. రేవంత్‌రెడ్డి చెబుతున్నట్లు 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలంటే రూ.1.50 లక్షలకు పైగా ఖర్చు అవుతాయని, అన్ని డబ్బులు పెట్టుకునే ఆర్థిక స్తోమత లేదంటున్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే కరెంటు కష్టాలు కొని తెచ్చుకున్నట్లేనని రైతులు ఆందోళన చెందుతున్నారు. పదేళ్లుగా కేసీఆర్ ప్రభుత్వం రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తుండగా, రైతులు వరి, మక్క, ఇతర ఉద్యానవన పంటలు సాగు చేసుకుంటూ ఆర్థికంగా బలోపేతమయ్యారు. ఇలాంటి తరుణంలో మళ్లీ పాత రోజులు వద్దని రైతులు చెబుతున్నారు. 3గంటల కరెంటు అంటున్న కాంగ్రెస్‌కు ఈనెల 30న ఓటుతో బుద్ధి చెబుతామంటున్నారు.

## పారిన మడే పారుతుండే..



ఇచ్చోడ, నవంబర్ 25 : గతంలో కరెంట్ కష్టాలు చెప్పాలంటే రోజులే పడుతయ్. కరెంటు ఎప్పుడొస్తదో ఎప్పుడు పోతదో తెలిసేది కాదు. త్రీఫేజ్ కరెంట్ ఉదయం, రాత్రి రెండు విడుతల్లో ఉండేది. గిప్పుడు మళ్లీ కాంగ్రెసోళ్లు పాత కథ పాడుతున్నరు. 3 గంటల కరెంట్ చాలంటున్నరు. గీళ్లకు రెండు ఎడ్లు పెట్టి పొలం పని చేయించాలే. గప్పుడయితనే ఎవుసం ఎట్ల చేస్తరో తెలుస్తది. నీళ్ల పారకుంటే పొలం ఏం అయితదో తెలుస్తది. నోటికి ఎదొస్తే అది మాట్లాడుతున్నరు. మాకాడ ఉల్లి నాటు వేయాలంటే ఆయిలింజన్ వేసుకోవాల్సిందే. లేకుండా నారు పీకే కూలీలను పిలుసుకొని మడులను నీరు తడిపి నాటు వేసి ఆ తర్వాత ఫుల్ తడి పెట్టేవాళ్లం. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చినకం చిన్న గ్రామమైనా మా ఊళ్లో విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేసిన్రు. కరెంటు ఫుల్లుగా ఉంపటన్నది. కాంగ్రెసోళ్లు వస్తే మళ్లీ మోటర్ల కాడ మీటర్లు పెడుతరు. వాళ్లను నమ్మేతందుకు లేదు. రైతులంటే ఆ పార్టీ వోళ్లకు గిట్టది. ఢిల్లీ లీడర్ల పెత్తనం మనమీద ఉంటది. గందుకే రైతులెవ్వరూ కాంగ్రెస్‌కు ఓటెయ్యరంట. **- బలగం రవి, గేర్జం, ఇచ్చోడ మండలం**

## ధరణి రద్దు చేస్తే దళారులదే రాజ్యం



సొనాల, నవంబర్ 25 : కాంగ్రెస్ అధికారం లోకి వస్తే ధరణి రద్దు చేస్తామని చెబుతుంది. అట్లయితే తిరిగి దళారుల రాజ్యం వస్తది. ఇన్నేండ్లు రైతులు తమ భూములను తమ పేరు మీదకు తెచ్చుకునేందుకు దళారులను ఆశ్రయించి లంచాలు ఇస్తేనే పని అయ్యేది. సీఎం కేసీఆర్ ధరణి పోర్టల్‌ను తీసుకురావడంతో ఆ తిప్పలన్నీ తప్పిపోయాయి. దళారీ వ్యవస్థ పూర్తిగా రద్దయి పోయింది. గతంలో ఎవరైనా భూమిని కొనుగోలు చేస్తే రిజిస్ట్రార్ కార్యాలయంలో రోజంతా ఉంటేనే డాక్యుమెంటేషన్ పూర్తయ్యేది. దాన్ని రెవెన్యూ అధికారులకు అందించి దళారుల ద్వారా ముడుపులు అప్ప జెప్పి నెలల తరబడి కార్యాలయం చుట్టూ తిరిగితే గానీ మ్యుటేషన్ చేసేది. ధరణి వచ్చిన తర్వాత ఆ తిప్పలన్నీ తొలగిపోయాయి. స్లాట్‌బుక్ చేసుకొని సమయానికి వెళ్తే 15 నిమిషాల్లోనే పట్టా మార్పిడి చేసి సంబంధిత కాగితాలను మన చేతి కిచ్చి పంపిస్తున్నారు. ఎవరికీ ఒక్క పైసా ఇవ్వకుండానే పని పూర్తవుతుంది. అంతమంచి ధరణిని రద్దు చేస్తామనడం సరికాదు . దీనిని దృష్టిలో పెట్టుకొని ఓటెవరికి వేయాలో రైతులు నిర్ణయించుకోవాలి. **-తగిరె రింగుసింగ్, రైతు, గుట్టపక్కతండా, సొనాల మండలం**

## మన నోట్లే.. మనమే మట్టి పోసుకుంటమా..



తాంసి, నవంబర్ 25 : 24 గంటల ఉచిత కరెంట్‌తో ఒక్క గుంట భూమి కూడా బీడుగా ఉండడం లేదు. తెలంగాణ రాక ముందు కరెంటు సరిగ్గా లేక భూములన్నీ బీడువారేవి. దీంతో రైతులం అందరం ఎక్కడికక్కడికో వలస వెళ్లే వాళ్లం. ఇప్పుడింక 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని కాంగ్రెసోళ్లు చెబుతున్నారు. ఆ మోటర్లు పెట్టాలంటే రైతుల నెత్తి మీద ఖర్చు పిడుగు పడుతది. అవి కరాబ్ అయితే రిపేర్ చేయాలంటే మళ్లా అప్పులు చేయాల్సిన పరిస్థితి వస్తది. కేసీఆర్ ప్రభుత్వంలో మోటర్లు కాలుడు లేదు. ఇంత మంచి సౌలత్ ఉండంగ మళ్లా గా కాంగ్రెసోళ్లు వచ్చి ఏం జేస్తరు. కాంగ్రెస్ వస్తే మళ్లా అప్పుల బారిన పడుడే. అలాంటి వాళ్లకు అధికారం ఇచ్చి మన నోట్లో మనమే మట్టి పోసుకున్నడు అవుతది. **- రవీందర్ మెస్రం, యువరైతు, అంబుగాం, తాంసి మండలం.**

## సగం భూమి వదిలేసుకోవాలి..



నేరడిగొండ, నవంబర్ 25 : నాకు 14 ఎకరాల భూమి ఉంది. కేసీఆర్ సార్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి మాకు కరెంటు రంది లేదు. 24 గంటల కరెంటుతో మా భూమిలో పంటలు పండుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ వాళ్లు మూడు గంటల కరెంటు అంటున్నరు. మాకు 3 గంటల కరెంటిస్తే సగం వదిలేసుకునే పరిస్థితి. గిప్పుడు ప్రతి రోజు చేలకు నీటి తడి అందిస్తున్నాం. మూడు గంటల కరెంటుతో పంటలు పండవు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు మొత్తం పంట వేసేవాళ్లం కాదు. అప్పుడు కొంత ఏరియాలో మాత్రమే పంటలు వేసేవాళ్లం. కేసీఆర్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి కరెంటుకు ఇబ్బంది లేదు. అందుకే మేము బీఆర్ఎస్ పార్టీకి మద్దతు తెలుపుతం. **- జాదవ్ రంజిత్ కుమార్, భవానీతండా, నేరడిగొండ.**